నమస్తే తెలంగాణ
ములుగు
జయశంకర్ భూపాలపల్లి
12 | వరంగల్, సోమవారం 28 ఏప్రిల్ 2025 | MULUGU JAYASHANKAR BHUPALPALLY



రజతోత్సవ సభకు తరలివచ్చిన అశేష జనవాహిని

**ఊరూవాడ ఒక్కటై ఎల్కతుర్తికి తొవ్వపట్టింది.** బీఆర్ఎస్ పాతికేళ్ల పండుగ కోసం జట్టు కట్టి పోరుగల్లుకు పోటెత్తింది. ఉద్యమ సమయంలో కదంతొక్కిన విధంగా గులాబీ జెండాలు పట్టి.. ఆటపాటలు, డప్పచప్పళ్లు, కేరింతల నడుమ యావత్ తెలంగాణం జనప్రవాహమై కదిలివచ్చింది. పార్టీ రజతోత్సవం సందర్భంగా ఎక్కడికక్కడ బీఆర్ఎస్ జెండాలు ఎగురవేసిన గులాబీ సైన్యం, కేసీఆర్ అభిమాన గణం చీమలదండులా బైక్‌లు, కార్లు, బస్సులు, ఇతర వాహనాల్లో ర్యాలీగా మహాసభకు బయల్దేరడంతో కనుచూపు మేర దారులన్నీ కోలాహలంగా మారాయి. ఎటుచూసినా వాహనాల వరుసలే కనిపించగా చాలాచోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. కాగా.. దారి వెంట 'జై కేసీఆర్'.. 'జై తెలంగాణ' నినాదాల హోరుతో మార్మోగాయి. మధ్యాహ్నం నుంచే సభా ప్రాంగణానికి జనం రాక మొదలుకాగా, సాయంత్రం కల్లా నేల ఈనిందా అన్నట్లు లక్షలాది మంది ప్రభంజనంలా రావడంతో సభ సూపర్ సక్సెస్ అయింది. అభిమాన నేత కేసీఆర్ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురుచూసిన జనం.. సుమారు గంట పాటు సాగిన ప్రసంగాన్ని అంతే శ్రద్ధగా విని ఈలలు, చప్పట్లు, కేరింతలు కొట్టారు. - ఎల్కతుర్తి, ఏప్రిల్ 27

# ఊరూవాడ ఏకమై ఎల్కతుర్తికి ప్రభంజనమై



- పోరుగల్లుకు పోటెత్తిన సకల జనం
- జట్టు కట్టి.. తొవ్వవట్టిన యావత్ తెలంగాణం
- చీమలదండులా వరంగల్‌కు వాహనాల ప్రవాహం
- డప్పుచప్పళ్లు, కేరింతలు, నృత్యాలతో పండుగ వాతావరణం
- రజతోత్సవ జెండాలు ఎగరేసి.. బైకులు, కార్లతో ర్యాలీగా చేరుకున్న గులాబీ సైన్యం
- ఔటర్ రింగ్‌రోడ్‌పై కనుచూపు మేర కార్లు, బస్సులే
- కిలోమీటర్ల కొద్దీ ట్రాఫిక్ జామ్
- గులాబీ జెండాలు, ఫ్లెక్సీలతో దారులన్నీ గులాబీమయం
- కేసీఆర్‌ను చూసేందుకు, ఆయన మాటలు వినేందుకు కదిలొచ్చిన అభిమాన గణం
- జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తిన ప్రాంగణం
- అశేష జనవాహిని రాకతో బీఆర్ఎస్ మహాసభ సూపర్ సక్సెస్



సభా వేదిక వద్ద నినాదాలు చేస్తున్న మహిళలు



బీఆర్ఎస్ భారీ జెండాతో బైక్‌పై వస్తున్న యువకులు



వర్ధన్నపేట: ట్రాక్టర్ నడిపి ర్యాలీని ప్రారంభిస్తున్న ఎర్రబెల్లి



కేసీఆర్ ప్లకార్డుతో మహిళ



టీవీలో కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వీక్షిస్తున్న వృద్ధురాలు, చిన్నారి



బయ్యారం: నృత్యం చేస్తున్న కార్యకర్తలు



సభా ప్రాంగణం ప్రవేశ ద్వారం వద్ద నృత్యం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



సూర్యాపేట నుంచి ఎల్కతుర్తికి చేరుకున్న ఎడ్లబండ్లు



ట్రాఫిక్ జామ్ కావడంతో నిలిచిపోయిన వాహనాలు



కడిపికొండ బ్రిడ్జిపై నుంచి ఎల్కతుర్తికి వెళ్తున్న వాహనాలు

## సభ సక్సెస్

- లక్షలాది మంది తరలిరావడంతో పూర్తిగా నిండిన ప్రాంగణం
- కేసీఆర్ ప్రసంగానికి అపూర్వ స్పందన
- చప్పట్లు, ఈలలతో కార్యకర్తల సందడి



బయ్యారం: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే హరిప్రియ

ఎల్కతుర్తి, ఏప్రిల్ 27 : ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. రోడ్లకిరువైపులా కేసీఆర్, కేటీఆర్ కటౌట్లు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలను నిర్వాహకులు ఏర్పాటు చేయడంతో ఎక్కడ చూసినా ప్రధాన వీధులన్నీ గులాబీ శోభను సంతరించుకున్నాయి. బీఆర్ఎస్ రజతోత్సవ సభ మన ఇంటి పండగ అని, రాష్ట్రంలోని ప్రతి ఒక్కరు తరలిరావాలని నేతలు పిలుపునివ్వడంతో అదే తరహాలో ప్రజలు సైతం లక్షలాదిగా తరలివచ్చారు. రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారుల ఆటాపాట ఆకట్టుకున్నాయి. వారితో కలిసి ప్రజలు సైతం ఉత్సాహంగా డ్యాన్సులు చేస్తూ కనిపించారు. సాయంత్రం 5.30 గంటల వరకే సభా ప్రాంగణం పూర్తిగా నిండిపోయినప్పటికీ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వేలాది మంది కేసీఆర్ ప్రసంగిస్తుండగా నడుచుకుంటూ వస్తూ కనిపించారు. కేసీఆర్ ఏం చెప్తారోనని, ఆయన ప్రసంగం వినేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. కేసీఆర్ సభా వేదికపైకి చేరుకోగానే పెద్దఎత్తున నినాదాలు చేశారు. తెలంగాణ తల్లికి పూలమాల వేసిన అనంతరం ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్ ఆవిర్భావ ఆవశ్యకత, ఉద్యమ సమయంలో ఎదురైన ఒడిదొడుకులను కేసీఆర్ వివరించడంతో ప్రజలు ఆసక్తిగా విన్నారు. కాంగ్రెస్ ప్రజలను మోసం చేసిందని, ఆ పార్టీ చేసిన మోసాలను వివరిస్తుండగా కార్యకర్తలు చప్పట్లు, ఈలలతో సందడి చేస్తూ జై కేసీఆర్ అని నినాదించారు. ఆ తర్వాత భారీ ఎత్తున పార్టీ శ్రేణులు పటాకులు కాల్చారు. సభ అనుకున్న స్థాయికి మించి విజయవంతం కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సభ ముగిసిన అనంతరం కేసీఆర్ చింతలపల్లి, ధర్మసాగర్ మీదుగా ఎర్రవల్లిలోని ఆయన నివాసానికి రోడ్డు మార్గం ద్వారా వెళ్లారు.

### కేసీఆర్‌ను చూసేందుకు వచ్చిన..




కేసీఆర్‌ను దగ్గర నుంచి చూసేందుకు వచ్చిన. ఆయన మాటలు వినకుండా కాంగ్రెస్‌కు ఓటేసి ఆగమైనం. ఇప్పుడు ఎట్లా అని తండ్లాతున్నం. మళ్లీ ఎన్నికల వరకు ఆగాల్సిందే. కాంగ్రెసోళ్ల ఆగడాలు భరించాల్సిందే తప్ప చేసేదేమీ లేదు. కేసీఆర్ పథకాలను పేర్లు మార్చి అమలు చేయకుండా పైసలు లేవని చెప్పి మొత్తం బంద్ చేసింద్రు. పేదలు, రైతుల ఉసురు కాంగ్రెస్ సర్కార్‌కు, సీఎం రేవంత్‌కు తగులుద్ది. – గణపతి, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా

## జోష్ నింపిన కళాకారుల ఆటపాట



భీమదేవరపల్లి, ఏప్రిల్ 27 : ఎల్కతుర్తి రజతోత్సవ సభ కళాకారుల ఆటపాటలతో ఉర్రూతలూగింది. తెలంగాణ సాంస్కృతిక మాజీ చైర్మన్ రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో కళాకారులు సభను హోరెత్తించారు. 'గుర్తుల గుర్తుంచుకో రామక్క.. గులాబీ ల జెండలే రామక'. పాటకు కళాకారులతో పాటు సభకు వచ్చిన జనం డ్యాన్స్ వేశారు. 'కోట్ల గొంతులను ఏకం చేసింది తెలంగాణ జెండా.. కేసీఆర్ ఎగరేసిన ఈ గులాబీ జెండా' అనే పాటకు ప్రజల్లో ఆనందం పెల్లుబికింది. ఆద్యంతం జై తెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో సభా ప్రాంగణం మార్మోగింది. 'ఆగమైపోతున్నది తెలంగాణ.. అంధకారంలో ఉన్నది తెలంగాణ' అనే పాటను రసమయి పక్కనే ఉండి చిన్నారి గూడూరి కతిషారెడ్డితో పాడించగా ప్రజలు జేజేలు కొట్టారు. 'పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న గానమా'.. పాటకు ఎమ్మెల్యే మల్లారెడ్డి వేదికపై స్టెప్పులేసి జోష్ నింపారు.

## అడుగడుగునా ట్రాఫిక్ జామ్



మడికొండ : దేవన్నపేట టోల్‌ప్లాజా వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు

బీఆర్ఎస్ సభకు వెళ్లే వాహనాలకు అడుగడుగునా ట్రాఫిక్ జామ్ ఎదురైంది. ఖమ్మం, హైదరాబాద్ వైపు నుంచి వచ్చే వాహనాలను పోలీసులు రింగ్‌రోడ్డు మీదుగా ఎల్కతుర్తికి తరలించారు. దీంతో దేవన్నపేట టోల్‌ప్లాజా వద్ద సుమారు నాలుగు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోకపోవడం, టోల్ ప్లాజాలో సాంకేతిక సమస్య రావడంతో వాహనాలు ఆగిపోయాయి. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రైనీ ఐపీఎస్ మనన్ భట్ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. – మడికొండ, ఏప్రిల్ 27

## ఓరుగల్లుకు వందనం

- రాణీ రుద్రమదేవి ఏలిన గడ్డ
- సమ్మక్క, సారక్కల పోరుగడ్డ
- ప్రసంగం ప్రారంభంలోనే వరంగల్‌ను ప్రస్తావించిన కేసీఆర్
- పదేళ్లలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని వెల్లడి
- హైడ్రా పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్లు కూలుస్తున్నదని మండిపాటు
- 2014కు ముందు పరిస్థితులు వస్తున్నాయని ఆవేదన
- సభ కోసం భూములిచ్చిన రైతులకు ధన్యవాదాలు తెలిపిన అధినేత

హనుమకొండ, ఏప్రిల్ 27 : 'తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు బీఆర్ఎస్‌తో వరంగల్‌కు అనుబంధం ఉంది. 25 ఏండ్ల పార్టీ చరిత్రను తెలిపేలా ఇక్కడ రజతోత్సవ మహాసభను జరుపుకుంటున్నాం. ఓరుగల్లు గడ్డకు ప్రత్యేకత ఉంది. రాణి రుద్రమదేవి ఏలిన గడ్డ.. సమ్మక్క సారక్కల పోరుగడ్డ.. బమ్మెర పోతన కవితా మాధుర్యం పండించిన ఓరుగల్లుకు వందనం' అని పార్టీ అధినేత కేసీఆర్ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. అంతకు ముందు సభా వేదికపైకి చేరుకొన్న కేసీఆర్ అమరులకు పూలు చల్లి నివాళులర్పించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రదాడిలో మృతిచెందిన వారికి నివాళిగా నిమిషం పాటు మౌనం పాటించారు. తొలుత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్వాగతోపన్యాసం చేశారు. అనంతరం కేసీఆర్ ప్రసంగిస్తూ 25 ఏండ్ల క్రితం ఎగిరిన గులాబీ జెండా మూగబోయిన తెలంగాణకు ఊపిరి పోసిందన్నారు. త్యాగాల పునాదులపై రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. అనేక మంది ఆత్మహత్యలు, బలిదానాలతో సిద్ధించిన తెలంగాణ పదేళ్లలో అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. బీఆర్ఎస్ పాలనలో పెండింగ్‌లో ఉన్న దేవాదులను పూర్తి చేయడంతో పాటు మూడేళ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించుకున్నామని చెప్పారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించామన్నారు. హైదరాబాద్, వరంగల్ లాంటి పట్టణాల్లో ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలిచ్చామని, ఆనాడు బుల్డోజర్లతో మట్టిని తీస్తే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో నిరుపేదల ఇళ్లు కూల్చివేస్తున్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అసమర్థత, అవివేకం, అనుభవం లేని పాలనతో తెలంగాణలో 2014కు ముందున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. చివరగా సభ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, దాస్యం వినయ్ భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, సభ కోసం భూములిచ్చి సహకరించిన ఎల్కతుర్తి, ఇతర గ్రామాల రైతులకు కేసీఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



కేసీఆర్‌తో ఎమ్మెల్యే పల్లా, మాజీ ఎమ్మెల్యే దాస్యం





కశ్మీర్‌లో ఉగ్రదాడి మృతులకు సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న కేసీఆర్, కేటీఆర్, నాయకులు